సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



దూసుకొచ్చిన మృత్యువు

ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. 8లో▸



మురికినీటితో భోజనం

మురికినీటితో మధ్యాహ్న భోజనం వండుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. 8లో▸



వ్యక్తిత్వ వికాసం పెంచుకోండి

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలని మనోవిజ్ఞాన శాస్త్ర నిపుణుడు రాధాకిషన్‌రావు సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు చేవెళ్ల విద్యార్థిని ఎంపిక



ఉమాదేవిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి

మొయినాబాద్‌రూరల్: ఢిల్లీలోని ప్రగతి మైదానంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల విద్యార్థిని ఉమాదేవి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఎంపికైన విద్యార్థిని అభినందించి సన్మానించారు. జనవరిలో నిర్మల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తన ప్రతిభతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్మరక్షణే బజరంగ్‌దళ్ లక్ష్యం

వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి పండిరినాథ్



శౌర్య జాగరణయాత్ర

మహేశ్వరం: ధర్మ రక్షణ కోసమే బజరంగ్‌దళ్ పని చేస్తుందని విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యదర్శి పండిరినాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం శౌర్య జాగరణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉగ్రవాదం, వేర్పాటువాదం, కులతత్వం, లవ్ జిహాద్ పేరుతో హిందూ సమాజంపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు దేశ వ్యతిరేక, జాతి వ్యతిరేక కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అంతకుముందు శివగంగ రాజరాజేశ్వర ఆలయం నుంచి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు కుమార స్వామి, రిటైర్డ్ ఆర్మీ కల్నల్ అనిల్‌కుమార్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సాకుంట్ల శ్రీనివాస్, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ ఎర్ర రాఘవేందర్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మండల రాజు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నలుగురి రిమాండ్

ఇబ్రహీంపట్నం: బాలికను అత్యాచారం చేసిన కేసులో నలుగురు నిందితులను శనివారం ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం కైమూర్ జిల్లా అమావాన్ గ్రామానికి చెందిన ధర్మేంద్ర సింగ్ (22) అదే గ్రామానికి చెందిన బాలిక (17) ప్రేమించుకున్నారు. పది రోజుల క్రితం ధర్మేంద్రసింగ్ పనికోసం ఇబ్రహీంపట్నం వచ్చి అదే జిల్లాకు చెందిన చందన్‌కుమార్ (24), చందన్ కుమార్ (17)తో కలిసి ఇబ్రహీంపట్నంలో ఒకే గదిలో ఉంటూ కూలి పనులు చేస్తున్నారు. బాలిక గురువారం రాత్రి హైదరాబాద్‌కు రావడంతో ఆమెను ధర్మేంద్రసింగ్ తీసుకొచ్చి తన గదిలో ఉంచారు. అప్పటికే గదిలో ఉన్న మిత్రులిద్దరూ వీళ్లను చూసి బయటికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత మరో ఇద్దరు శంభు (35), మల్లు(20)తో కలిసి వచ్చారు. ధర్మేంద్రసింగ్‌ను బయటికి నెట్టేసి తలుపులు బిగించి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ధర్మేంద్రసింగ్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లగా నిందితులుపరారయ్యారు.బాలికను వైద్య పరీక్షలకు తరలించారు.నిందితుల కోసం గాలింపు చర్యలుచేపట్టగా శనివారం ఉదయం పోలీసులకు చిక్కారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బతుకమ్మ చీరలకు నిప్పు



కొందుర్గు: ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు నాసిరకంగా ఉన్నాయంటూ మండల పరిధిలోని గంగన్నగూడ గ్రామానికి చెందిన కొందరు మహిళలు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసి నిప్పంటించారు. ప్రభుత్వం పంపిణీ చేసే చీరలను ఎవరూ వినియోగించుకోవడం లేదని, పొలం గట్లపై పంటలకు రక్షణగా, పాత ఇనుప సామాన్లకు అమ్మడానికే వాడుతున్నారని పేర్కొన్నారు.

చుట్టేస్తున్నారు



ఇటీవల షాద్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

జిల్లాలో విస్తృతంగా మంత్రుల పర్యటనలు

- శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలతో బిజీ
- ఒకవైపు అభివృద్ధి మంత్రం.. మరోవైపు బుజ్జగింపుల పర్వం
- కేడర్‌ను ఒక్కతాటిపైకి తీసుకువచ్చే ప్రయత్నం
- అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార బీఆర్‌ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా జిల్లాపై ఫోకస్ పెట్టింది. ఇక్కడ గెలుపొందే సీట్లే కీలకంగా మారతాయని.. ఈ మేరకు మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఒకవైపు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ.. మరోవైపు ఇప్పటికే చేపట్టిన పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాల పేరుతో విస్తృత ప్రచారం చేస్తోంది. తొమ్మిదిన్నరేళ్లలో చేసిన అభివృద్ధి పనులు.. సంక్షేమ పథకాలు.. వాటి ఫలితాలను ప్రజలకు వివరిస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తోంది. కొద్ది రోజులుగా మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విస్తృత పర్యటనలు చేస్తున్నారు. హోంమంత్రి మహమూద్ అలీ, పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తరచూ పర్యటిస్తున్నారు. ఇక జిల్లా మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి మహేశ్వరం, చేవెళ్ల నియోజకవర్గాల్లో కలి యతిరుగుతున్నారు.

సెమీ అర్బన్ కావడం వల్లే..

ఉమ్మడి జిల్లాలో 18 నియోజకవర్గాలు ఉండగా, వీటిలో మెజార్టీ సెమీ అర్బన్ ప్రాంతాల్లోనే విస్తరించి ఉన్నాయి. ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, మేడ్చల్ నియోజకవర్గాల్లోని చాలా ప్రాంతాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత ఓటర్లతో పోలిస్తే ఇక్కడి ఓటర్లకు రాజకీయ చైతన్యం ఎక్కువ. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఇక్కడ మిశ్రమ ఫలితాలు వచ్చాయి. అధిష్టానం అంతా గ్రేటర్‌లో పర్యటించినా.. ఆశించిన స్థాయిలో డివిజన్లు గెలవలేకపోయింది. మరోవైపు ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరు ముగ్గురు బలమైన నేతలు ఉన్నారు. మళ్లీ సిట్టింగ్‌లకే టికెట్ ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో ఆశావహులు పక్క చూపు చూస్తున్నారు. ఇప్పటికే కొంత మంది నేతలు పార్టీని వీడారు. ఈ నేపథ్యంలో నేతల మధ్య సమన్వయ లోపాన్ని.. అంతర్గత కుమ్ములాటలను చక్కదిద్ది.. పార్టీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధిష్టానం నిర్ణయించింది. కేడర్‌ను ఒక్కతాటిపైకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

ముమ్మరంగా పర్యటనలు

రెండు మూడు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందన్న ప్రచారంతో మంత్రులు తమ పర్యటనలను ముమ్మరం చేశారు. మంత్రి కేటీఆర్, పార్టీలో ట్రబుల్ షూటర్‌గా గుర్తింపు పొందిన మంత్రి హరీశ్‌రావు రెండుమూడు రోజులకోసారి జిల్లాలో పర్యటిస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ .. ప్రభుత్వ పథకాలను గుర్తు చేస్తూ.. ప్రతిపక్షాలను ఎండగడుతూ వస్తున్నారు. ఇంకోవైపు ఇప్పటి వరకు పార్టీలో గుర్తింపు, ప్రభుత్వ శాఖల్లో పదవులు దక్కక తీవ్ర అసంతృప్తితో ఉన్న నేతలను బుజ్జగిస్తూ.. వారు పార్టీ వీడకుండా చూస్తున్నారు. తాజాగా శనివారం హోంమంత్రి మహమూద్ అలీ కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్ మండలంలో పర్యటించారు. కొత్తగా నిర్మించిన పోలీసు స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో రూ.2.40 కోట్లతో నిర్మించే 24 కుల సంఘాల ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి పట్నం మహేందర్ రెడ్డి చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలోని హైతాబాద్,మచనపల్లి, మల్లారెడ్డి గూడా గ్రామాల్లో పర్యటించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ పనిలోపనిగా అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరీశ్

రైతులకు నష్టం రావద్దు

ఇబ్రహీంపట్నం రూరల్: పత్తిసాగు చేస్తున్న రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ హరీశ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిన్నింగ్ మిల్లర్లు, బ్రాంచ్ మేనేజర్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మహబూబ్‌నగర్, మార్కెట్ కమిటీ సెక్రెటరీలు, ట్రాన్స్‌కో అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పత్తిని పండించే రైతులు ఆధార్ అథెంటికేషన్, ఆధార్ బ్యాంకు లింకేజీ చేసుకునేలా చూడాలన్నారు. రైతులకు కేటాయించిన మిల్లులకే పత్తిని పంపించాలని, ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని, పత్తి మిల్లుల్లో పనిముట్ల పనితీరును తనిఖీ చేయాలన్నారు. 2023–24 సంవత్సరానికి జిల్లాలో సాగు చేసిన పత్తి దిగుబడులను అంచనా వేసి కనీస మద్దతు ధర రూ.7,020గా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో 15 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పత్తి కొనుగోలు కేంద్రాలకు తరలింపు విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, వ్యవసాయ అధికారి గీతారెడ్డి, బ్రాంచ్ మేనేజర్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మహబూబ్‌నగర్ జిన్నింగ్ మిల్లర్లు, మార్కెట్ కమిటీ సెక్రెటరీలు, అగ్నిమాపక అధికారి, ట్రాన్స్‌కో అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో జిల్లా అదనపు కోర్టు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో జిల్లా అదనపు న్యాయస్థానం ఏర్పాటు కాబోతోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఇబ్రహీంపట్నంలో నాలుగు కోర్టులు పని చేస్తున్నాయి. 5వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి, 15 అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సైబరాబాద్‌ను ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న కోర్టు ఆవరణలో తాత్కాలిక భవనం నిర్మాణం చేసి, లేదంటే కోర్టు ఎదుట ఉన్న ఉర్దూమీడియం హాస్టల్ భవనంలో కొత్త కోర్టును నిర్మించనున్నారు. ఈ కోర్టు పరిధిలోకి ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం మండలాలు రానున్నాయి. జిల్లా అదనపు కోర్టు రావడంతో కేసులు సులభతరం కానున్నాయని న్యాయశాఖ నిపుణులు చెబుతున్నారు.



హైతాబాద్ నుంచి అంకుగూడ వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

పారిశ్రామిక ఖిల్లాగా జిల్లా

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్: గతంలో పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన జిల్లా నేడు పారిశ్రామిక ఖిల్లాగా మారిందని.. దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని గనులు, భూగర్భ వనరులు, సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హైతాబాద్ నుంచి అంకుగూడ వరకు, మాచన్‌పల్లి నుంచి పోతుగల్ వరకు, మల్లారెడ్డిగూడ నుంచి పోలారం వరకు రూ.8.65 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు తో ఉమ్మడి జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందబోతోందని తెలిపారు. ఆదిబట్ల, షాబా ద్ పారిశ్రామికవాడలు ప్రపంచ చిత్రపటంలో నిలుస్తున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో చందనవెల్లి, సీతారాంపూర్‌లో పలు పరిశ్రమలు వచ్చాయని.. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మూడోసారి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. అమలుకు సాధ్యం కాని హామీలు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తామంటే ఎలా నమ్ముతారని ప్రశ్నించారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్నం అవినాశ్ రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, సర్పంచ్‌లు మల్లేష్, మహేందర్‌రెడ్డి, మంగమ్మ, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, సహకార సంఘం ఉపాధ్యక్షుడు మద్దూర్ మల్లేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆ సెగ్మెంట్లపై ప్రత్యేక నిఘా

- ఓటర్లు ఐదు లక్షల కంటే ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలపై దృష్టి
- భారీగా నిధుల వరద పారనుందని అంచనా
- నిరోధానికి పకడ్బందీ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం, ధన ప్రవాహం, డ్రగ్స్ సరఫరా కట్టడికి పటిష్టమైన పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకుగాను వివిధ విభాగాలతో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా, రాష్ట్రంలోనే ఓటర్ల సంఖ్య అత్యధికంగా.. ఐదు లక్షల కంటే ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో డబ్బు, మద్యం ప్రవాహం కూడా ఎక్కువే ఉంటుంది కనుక..వాటిపై స్పెషల్ నిఘా వేయనున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో సైతం ఆ నియోజకవర్గాల్లో అధిక మొత్తంలో ధనం, మద్యం ప్రవాహం జరిగినట్లు గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి అందుకు తావులేకుండా అడ్డుకట్ట వేయాల్సిందిగా సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఉన్న, జీహెచ్‌ఎంసీ పరిధిలోకొచ్చే సదరు అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేక నిఘా ఉండనుంది. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సైతం సదరు నియోజకవర్గాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో సదరు నియోజకవర్గాల్లో డ్రగ్స్, మద్యం,డబ్బు పంపిణీ నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగా డ్రగ్స్, లిక్కర్ సరఫరా నియంత్రణకు శివార్లలోని పెద్ద అంబర్‌పేట, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ ఆపరేషన్లు నిర్వహించాల్సిందిగా కూడా ఉన్నతాధికారులు సంబంధిత అధికారులకు ఇప్పటికే సూచించారు.

ఐదులక్షలకుపైగా ఓటర్లున్న నియోజకవర్గాలు

- శేరిలింగంపల్లి (6,98,133 మంది ఓటర్లు)
- కుత్బుల్లాపూర్ (6,69,361 ఓటర్లు)
- ఎల్‌బీనగర్ (5,66,866 ఓటర్లు)
- మహేశ్వరం(5,17,316 ఓటర్లు)
- రాజేంద్రనగర్ (5,52,455 ఓటర్లు)
- మేడ్చల్ (5,95,536 ఓటర్లు)
- ఉప్పల్ (5,10,345మంది ఓటర్లు)
- మల్కాజిగిరి నియోజకవర్గంలో ఐదు లక్షల కంటే కాస్త తక్కువగా 4,69,078 మంది ఓటర్లున్నారు.

తెలంగాణ పోలీసింగ్ దేశానికే ఆదర్శం

- హోంమంత్రి మహమూద్ అలీ
- కడ్తాల్‌లో నూతన పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం
- హాజరైన డీజీపీ, సీపీ, ఎంపీ, ఎమ్మెల్యే



పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ, చిత్రంలో డీజీపీ, ఎమ్మెల్యే తదితరులు

కడ్తాల్: తెలంగాణ పోలీసుల పనితీరు దేశానికే తలమానికమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. మండల కేంద్రంలో రూ.1.50 కోట్ల సీఎస్‌ఆర్ ఫండ్ (బటర్ ఫ్లై సిటీ సహకారం)తో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని శనివారం డీజీపీ అంజనీకుమార్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు డిమాండ్‌తో కేసీఆర్ పలుమార్లు ఢిల్లీకి వెళ్లి తెలంగాణ ఇవ్వాలని కోరినా.. తెలంగాణలో లా అండ్ ఆర్డర్ బాగోలేదని, నక్సలిజం ఉందని చెప్పేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో శాంతిభద్రతలు, అభివృద్ధి, సంక్షేమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఇందుకోసం సీఎం కేసీఆర్ ఎంతగానో కృషిచేశారని తెలిపారు. పోలీసు శాఖకు పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఉమ్మడి పాలనలో హైదరాబాద్, సైబరాబాద్ రెండు కమిషనరేట్లే ఉండేవని, తెలంగాణ ఏర్పాటు తర్వాత వీటి సంఖ్య 9కి చేరుకుందని చెప్పారు. పోలీసు శాఖలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించామని, దేశంలో ఎక్కడా లేని విధంగా 64 శాతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, రాష్ట్రంలో పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యం

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖతో పాటు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. ముఖ్యంగా మహిళల భద్రతపై ఎక్కువ దృష్టిసారించామని తెలిపారు. కడ్తాల్‌లో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనం అన్ని రకాల సదుపాయాలతో అద్భుతంగా ఉందన్నారు.

పోలీస్ వ్యవస్థ పనితీరు భేష్

రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పనితీరు సమర్థవంతంగా ఉందని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవడంతో పాటు డిపార్ట్‌మెంట్‌లో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారని తెలిపారు.

పోలీసుల కృషి ప్రశంసనీయం

సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన స్థలం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి మహమూద్ అలీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

సీఎండీ, ఈడీకి సన్మానం

రూ.1.50 కోట్లతో పోలీస్‌స్టేషన్ భవనం నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన ఫార్చూన్ బటర్ ఫ్లై సిటీ సీఎండీ శేషగిరిరావు, ఈడీ రమేశ్‌ను.. హోంమంత్రి, డీజీపీ అంజనీకుమార్, ఎంపీ, ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌ఎంపీపీ ఆనంద్, డీసీపీ నారాయణరెడ్డి, ఏడీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ రంగస్వామి, ఎస్‌హెచ్‌ఓలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పథకాల్లో మానవీయ, సామాజిక కోణం

- మంత్రి సబితారెడ్డి



హుడాకాంప్లెక్స్: కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న మంత్రి సబితా రెడ్డి

హుడాకాంప్లెక్స్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టే పథకాల్లో మానవీయ, సామాజిక కోణం కనిపిస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. ఆడపిల్లలకు సీఎం కేసీఆర్ మేనమామ పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. బతుకమ్మ పండుగను ఉద్యమంలో కలుపుకొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, బతుకమ్మను గిన్నీస్ బుక్‌లో ఎక్కించిన ఘనత కేసీఆర్‌దేని అన్నారు. ప్రపంచంలో ఆడబిడ్డలు ఎక్కడున్నా బతుకమ్మ పండుగను చేసుకుంటున్నారని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు వస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి, నాయకులు అరవింద్‌శర్మ, బేర బాలకిషన్, మహేందర్ యాదవ్, లోకసాని కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విజన్‌తో అభివృద్ధి

మీర్‌పేట: ప్రత్యేక విజన్‌తో కార్పొరేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు వద్ద రూ.60 లక్షలతో నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయం ప్రారంభం, రూ.2 కోట్లతో నిర్మించే దోభీఘాట్‌తోపాటు పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మీర్‌పేట, బడంగ్‌పేట జంట కార్పొరేషన్లలో అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ రూ.వంద కోట్ల నిధులను మంజూరు చేయగా పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు మరోసారి ఓటు వేసి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, కమిషనర్ వాణి, డీఈ గోపీనాథ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మురికినీటితో మధ్యాహ్న భోజనం

- ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల ఆగ్రహం
- నల్లా కనెక్షన్‌ను సరి చేయించిన ఎంఈఓ


నీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంఈఓ

షాద్‌నగర్‌రూరల్‌: మురికినీటితో మధ్యాహ్న భోజనం వండుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. శనివారం ఫరూఖ్‌నగర్‌ మండలంలోని వెలిజర్ల ప్రాథమిక పాఠశాలలో మురికినీటితో భోజనం వండుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 15 రోజులుగా మురికినీటితోనే వండుతున్నారని మండిపడ్డారు. పాఠశాలలో నల్లా సక్రమంగా రావడం లేదు. గ్రామ ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్‌ చేశారు. స్పందించిన ఎంఈఓ శంకర్‌రాథోడ్‌ వెంటనే వెలిజర్ల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు వచ్చే నల్లా కనెక్షన్‌ సక్రమంగా లేకపోవడంతోనే మురికినీరు వచ్చిందని, కానీ ఆ నీటితో వంట చేశారనేది వాస్తవం కాదని ఎంఈఓ తెలిపారు. గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడి నల్లా కనెక్షన్‌ను సరి చేయించారు. మరొకసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. సకాలంలో స్పందించి పాఠశాలకు స్వచ్ఛమైన నీరు అందేలా కృషి చేసిన ఎంఈఓ శంకర్‌రాథోడ్‌కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- అక్కడికక్కడే మహిళ మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- అజీజ్‌నగర్‌ పాతగేట్‌ వద్ద ప్రమాదం


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న మంత్రి మహేందర్‌రెడ్డి

మొయినాబాద్‌: ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మొయినాబాద్‌ పీఎస్‌ పరిధిలోని అజీజ్‌నగర్‌ పాత గేట్‌ సమీపంలో శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సీఐ ఏవీ రంగా వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం తంగడపల్లికి చెందిన భాస్కర్‌గౌడ్‌, కవిత(38) నగరంలోని ఆసిఫ్‌నగర్‌లో అద్దెకు ఉంటూ.. మెహిదీపట్నం రైతుబజార్‌లో కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు. వారం రోజుల క్రితం కవిత తల్లి చనిపోవడంతో పెత్తరమావాస్యకు ముందు.. పెద్దలకు బియ్యం ఇవ్వాలనే ఉద్దేశంతో కొడుకు రాకేశ్‌తో కలిసి ముగ్గురూ బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. అజీజ్‌నగర్‌ పాత గేటు సమీపంలోకి రాగానే.. ట్రాఫిక్‌ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారని గమనించిన రాకేశ్‌ పక్కకు ఆపుకొనేందుకు బైక్‌ను స్లో చేశాడు. ఈ సమయంలో వెనక నుంచి దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న కవిత ఎగిరి రోడ్డుపై పడిపోయింది. బస్సు ముందు చక్రాలు ఆమె పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. భాస్కర్‌గౌడ్‌, రాకేశ్‌కు గాయాలయ్యాయి. తమ కళ్లెదుటే కవిత చనిపోవడంతో కొడుకు, భర్త గుండెలు బాదుకున్నారు. మృతురాలు కవిత పుట్టిల్లు, మెట్టిల్లు తంగడపల్లే కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్థానికుల నిరసన

విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. ఇరుకుగా ఉన్న పాత గేట్‌ సమీపంలో తనిఖీలు నిర్వహించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్‌ పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. పోలీసులు వీరికి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. ఇదే మార్గంలో వెళ్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి కాన్వాయ్‌ను ఆపి ప్రమాద తీరును పరిశీలించారు. పోలీసుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


డబుల్‌ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌

కడ్తాల్‌: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ అన్నారు. శనివారం మండలంలోని 'కడ్తాల్‌– పడకల్‌' డబుల్‌ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం గ్రామాల, తండాల అభివృద్ధికి వందల కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కల్వకుర్తికి చెందిన ఓ వ్యక్తికి రెండుసార్లు బీఆర్‌ఎస్‌ పార్టీ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. అయినా ఆ వ్యక్తి పార్టీకి అన్యాయం చేసి, కాంగ్రెస్‌ పార్టీలో చేరి సీఎం కేసీఆర్‌కు నమ్మక ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి వస్తే అతను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కడ్తాల్‌ పరిసరా ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నా ఫార్మాసిటీతో ఈ ప్రాంతానికి మెట్రో రైలు మార్గం రానుందని, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల మీదుగా ట్రిబుల్‌ఆర్‌ రోడ్డు రానుందని, దీంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ పార్టీని ఆశీర్వాదించాలని కోరారు. అనంతరం చల్లంపల్లి గ్రామంలో ఎమ్మెల్యేతో కలిసి బీఆర్‌ఎస్‌ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌ నాయక్‌, సింగిల్‌విండో చైర్మన్‌ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు కృష్ణయ్య యాదవ్‌, లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్‌ జైపాల్‌రెడ్డి, రాజేందర్‌యాదవ్‌, సుదర్శన్‌రెడ్డి, రాములు నాయక్‌, ఎంపీడీఓ రామకృష్ణ, అధికారులు, నాయకులు ఉన్నారు.

అభివృద్ధే తారక మంత్రం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్‌: గ్రామాల అభివృద్ధే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తారక మంత్రమని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో శనివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. పోచారంలో రూ.51 లక్షలు, పోల్కంపల్లిలో రూ.50 లక్షలు, నాగన్‌పల్లిలో రూ.31 లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్‌ ఏర్పుల చంద్రయ్య, ఎంపీపీ కృపేశ్‌, జెడ్పీటీసీ మహిపాల్‌, వైస్‌ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు అరుణ, అండాలు, జగన్‌, ఎంపీటీసీ చెరుకూరి మంగ, ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ వెంకటమ్మ, ఏఈ ఇంద్రాసేనారెడ్డి, ఉప సర్పంచ్‌లు జంగారెడ్డి, బీరప్పలతో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోండి

షాద్‌నగర్‌రూరల్‌: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలని మనోవిజ్ఞాన శాస్త్ర నిపుణుడు, ఉస్మానియా యూనివర్శిటీ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ రాధాకిషన్‌రావు సూచించారు. పట్టణంలోని బీఏఎం డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు మనోవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయన్నారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి సమాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ప్రిన్సిపాల్‌ వెంకటయ్యగౌడ్‌, మచ్చేందర్‌, నాగరాజు పాల్గొన్నారు.